# అద్దం ముందు

అందరూ నావేపు ఎందుకలా చూస్తారు? ఏమిటి దొరుకుతుం దనో వారికి - నావేపు అట్లా చూస్తే?

అయితే నేను నిజంగా అందంగా ఉన్నా నన్నమాట !

అంత అందంగా వున్నానా? ఏమో మరి! నామట్టుకు నాకెలా తెలుస్తుంది!

మరి నేను అంత ఆకర్షవంతంగా ఉండ డానికి కారణం? ముక్కా, చెవులా, కురులా, చెక్కిళ్ళా, కనులా?

కాదు - ముక్కు ఎంతమాత్రము కాదు పొడుగ్గావుంది - కొన సూదిగా.

మరి చెవులా? చెవులూ కాదు కురులా? అందరి ఆడవాళ్ళ కున్నట్లే, నల్లగా పొడ వుగా ఉన్నాయి. కురులన్నీ చేర్చి అల్లితే చక్కని జడ అవుతుంది.

పండ్లవరుస బయటకు కనుపించనంత వరకు బాగా నేవుంది. చెక్కిళ్లు నునుపుగా, ఎత్తుగ ఉన్నాయి. యౌవనం వచ్చాక ప్రతీ పడుచు తనూలతలో కలిగే మార్పుల్లో ఇదొకటి?

అయితే కన్నులలో ఏదో ఆకర్షణశక్తి వున్నది. పెద్దవిగా గుండ్రంగా చక్రాలులా గున్నాయి. సన్నటి కాటుక తీర్పు కన్నులకు వింత అందం కలుగజేస్తుంది కను బొమ్మలు నల్లగ సన్నగ తీర్చిదిద్దినట్టు న్నాయి

* * *

ఆమెలో ఒక చైతన్యం కలిగింది. రోజూ అద్దంముందు కూర్చుని ఆమె తను ఎంత అందంగా ఉన్నదీ పరిశీలించుకుంటుంది

> "పిల్లలు పుట్టకముందు మా ఆవిడ అస్తమానం హార్మోనియం వాయిస్తుండేది. పిల్లలు పుట్టాక ఆవిడకు తీరిక లేకుండా పోయింది; హార్మోనియం మూలపడింది.
>
> "కాబట్టి పిల్లలు పుట్టటంవల్ల వుండే వుపయోగాలలో అదీ ఒకటన్నమాట!"

సంబంధాలు వస్తున్నాయి. అంతా వస్తు న్నారు. చూచి వెళుతున్నారు. కాని ఏ కారణాన్నో ఒక్క సంబంధం నిశ్చయం కావటంలేదు. ఆమెకు అనుమానం కలిగింది. ఏమి? తను అందంగా లేదనా!

ఈమాటు ఆమె కళ్లు ఎత్తిచూసింది, కాబోయే పెళ్లికుమారుని ముఖంలోకి ఆమె కళ్లు జ్యోతుల్లా ప్రకాశించాయి. పెళ్ళి కుమారుని ముఖంలో తృప్తి గోచరించింది వచ్చినవారు పిల్లని నచ్చామన్నారు. అన్నీ సవ్యంగా జరిగిపోయాయి ఆమె అత్తవా రింటికి వెళ్ళింది.

అత్తవారింటికి వచ్చినది మొదలు ఆమె ఇంకా శ్రద్ధవహిస్తూ వచ్చింది—సౌందర్య పోషణలో. పుట్టినింటినుంచి తెచ్చుకున్న టాయిలెట్ సామాను అయిపోయింది ఆఫీ సుకు పోతున్న భర్తతో ఆమె అంది ఒక నాడు.

ఆరికిరేవుల రామధర్మారావు

"ఏమండీ! ఒకమాట"

"ఏమిట'ని అతను వెనుదిరిగి ఆప్యా యంగా ఆమెవేపు చూశాడు.

"సాయంకాలం ఇంటికి తిరిగివచ్చే టప్పుడు ఒక పౌడరు డబ్బా తెస్తారా?"

"ఓస్! ఇంతేనా - అలాగే తెస్తాలే" అని అడుగు ముందుకువేశాడు. ఆమెకు కొంచెం ధైర్యం చేకూరింది

"ఒక స్నోసీసాకూడ తెచ్చి పెట్టండి. నేను మా ఇంటినుండి తెచ్చుకున్నది అయి పోయింది" అని మెల్లగా నసిగింది

"అలాగేలే" అని అతను ముందుకు సాగి పోయాడు. సాయంకాలానికి ఆమె కోర్కె నెరవేరింది

పనులన్నీ చేసుకుని, గదిలో నిలువు టద్దం ముందు నిలబడింది. ఆ అద్దం అంటే ఆమెకు ఎంతో సరదా తనగదిలో చేర్చ బడిన హంగుల్లో ఇదొకటి. ఆ ఇంటికి ఆ అద్దమూ ఆమే ఒకేసారి వచ్చినట్లు ఆమె మొదట్లో విన్నది. తన ప్రతిబింబం ఆ అద్దంలో చక్కగా కనుపిస్తుంది. అంగుళ కాబోలు ఆమెకు అమితమైన ఆప్యాయం, ఆ అద్దమంటే.

* * *

"ఏమండీ! ఈ అద్దం ఎంతకు కొన్నా రండి" అని అడిగింది భర్తను కొత్తలో.

"ఏం! బాగుందా? మన పెళ్లిముందు కొన్నా. నీకోసమే."

"ఆ! నాకోసమా!" ఆమె ఎంతో మురిసి పోయింది రోజుకి రెండుసార్లయినా అద్దాన్ని గుడ్డతో తుడిచేది తుడిచినంత సేపూ తన ప్రతిబింబం చూసుకునేది.

* * *

చేతనయినంతవరకు అర్ధరాత్రి చక్కగ ముస్తాబయింది ఇరుగుపొరుగువారు, చూడ వచ్చినవారు, అంతా ఆమె సలక్షణంగా వుందని అనడం వింది. కాని ఒక్కనాడూ భర్త ఆమాట అనలేదు. తను అందంగా వున్నానని భర్తచేత అనిపించుకోవాలను కుంది. అంతా లోపలపొగడ్తలేనా! తన భర్తకు తను అందంగా కనుపించడము లేదేమో! మరి తనని నచ్చినిదే ఎలా చేసు కున్నారు? అయినా ఇటువంటి గొడవల్లో ఆయనకు పట్టింపు లేదేమో - ఇంటిపని, ఆఫీసు తప్పిస్తే.

అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా భర్తను చేరింది. అతను నిద్రపోయి చాల సేపయింది. తట్టి లేపింది నిద్రభారంతో కళ్లెత్తి చూశాడు. అవలకు జరిగి మళ్ళీ నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు.

"ఏమండీ! అప్పుడే నిద్ర?"

జవాబు లేదు

"ఏమండి మిమ్మల్నే."

"ఆ" అని ఇటు ఒత్తిగిల్లాడు.

"అంత నిద్రేమిటండీ. ఊరు పొద్దు పోందే?"

"అవును నీకలాగే వుంటుంది" అని చిరా కుగా అన్నాడు. మూసిన కళ్లు విప్పలేదు. ఆమెకు ఆశాభంగమయింది అర్ధరాత్రి కలత నిద్రలో ఏమేమో పలవరించింది.

ఆరోజు పనిలో పొరపాటు జరిగింది. "అదేమిటమ్మా, అత్తింటి కోడలవు. అలా చేయవచ్చా!" అన్నారు అత్తగారు. సమా ధానం—అత్తగారి కళ్ళల్లోకి కోపంగా చూసింది ఆమె "ఆ! ఎలాగయితేనేం, సంపాదించేవులే రెండు కళ్ళు—చెంపకు చేరజేసి. గుడ్డెక్క పెట్టి కొట్టవచ్చేలా ... చూసావేం" అని ...

అత్తగారు. ఆమె అవమానంతో క్రుంగిపోయింది. రెండు చేతులతో కండ్లు మూసుకుని వచ్చి గదిలో అద్దంముందు చతికిలబడిపోయింది. నిజంగా తన కనుగుడ్లు ఎక్కివచ్చాయా? కళ్ళువిప్పి ఒక్కసారి చూసుకుంది. ముఖానికి కళ కళ్ళే అనుకుంది ఒకనాడు. ఆ కళ్ళే ఈనాడు గుడ్లగూబ కళ్ళయాయా?

* * *

"ఏమండీ! వచ్చినప్పటికన్న మీకోడలు చాల చిక్కిపోయింది. కారణం ఏమిటి" అని ఇరుగు పొరుగువారంతా అడిగారు అత్తగార్ని. తను వింది మాటలు చాటుగా. ఊరిలోవారి కెందుకో తన ఊసు - ఇంట్లోవారికి లేనప్పుడు. అవును - చాల చిక్కిపోయింది తను. నునుపైన బుగ్గలు ఇప్పుడు పాలిపోయాయి. కళ్ళు లోతుగా పీక్కుపోయాయి. ఆమెకు చాల కోపంవచ్చింది.

తనపై తాను శ్రద్ధతీసుకోవడం మానివేసింది. భర్తను తప్పించుకు తిరగడం మొదలు పెట్టింది. గదిలో నిలువుటద్దంమీద పెద్ద గుడ్డ కప్పింది. అది అచ్చట ఉండడము ఆమె కెంతో, ఏదో చెప్పరాని బాధగా వుంది. భర్తతో అంది ఒకనాడు-"ఏమండి ఈ అద్దం ఈ గదిలోంచి తీసివేస్తే?

"ఏం!" అని అమాయకంగా అడిగాడు అతను.

"అబ్బే-అది అక్కడ ఉండడం బాగు లేదు మరే గదిలోకైనా మార్పించండి."

"ఇంక ఎక్కడ పెట్టడం? ఎక్కడా బాగాలేందే. ఇంతకీ అది నిన్నేం చేసిందని?"

ఆమె మాట్లాడలేదు.

ఆవేళ అతను ఆఫీసునుంచి ముందుగా వచ్చాడు. చాల హుషారుగా ఉన్నాడు. ఆమెను చాల ప్రేమతో దగ్గరకు చేరదీసుకున్నాడు. "ఇవాళ సినీమాకు వెళదాం వస్తావా!"

ఆమె జవాబు చెప్పలేదు. కొంచెం దూరంగా తొలగిపోయింది.

"మూడు టైము అవుతూంది. తొందరగా తెములు" అంటూ పెరట్లోకి దారి తీశాడు. శూన్యంలోకి చూస్తూ ఆమె అలా అక్కడే నిలుచుండిపోయింది, అతను తిరిగి వచ్చేవరకు.

"ఇంకా తెములలేదూ?" అన్నాడతను.

"నేనురాను. మీ రొక్కరే వెళ్ళండి" అంది.

"ఛా! అదేమిటి! ఇద్దరం కలిసి వెళదాము పద"

"ఊహు!" అంది ఆమె బెట్టుసరిగా.

"వంట్లో బాగులేదా? అవును అమ్మ అంటూంది, ఈమధ్య నీ వంట్లో బాగుండడము లేదని. చాలచిక్కిపోయావు కూడ... సరేలే - ఆ సంగతి తరువాత ఆలోచిద్దాము. టైము అవుతూంది. నీవు రావన్నమాట. నే వెళుతున్నాను."

ఆమెలో తుఫాను చెలరేగింది. "ఇన్ని దినాలకు తెలిసివచ్చింది కాబోలు, నే చిక్కిపోయానని - కాదు నా అందంలో మార్పు వచ్చిందని - అదీ అమ్మ చెప్పగా." అనుకుంది బాధగా.

రోజులు గడుస్తున్న కొలదీ ఆమెకు బాధగా ఉంటూంది. అతనిలో చలనం లేదు. గదిలో అడుగుపెట్టింది మూలనున్న నిలువుటద్దం ఆమెకు కన్పించింది. ఆ అద్దం ఆమెకు ఒక శత్రువై కూర్చుంది. దానిపైనున్న గుడ్డతీసే ధైర్యము ఆమెలో లేదు.

ఎదురుగుండా టేబిలుపై నున్న చిన్న అద్దములో తన ప్రతిబింబం కన్పించి మాయమయింది. ధైర్యంతో ఒక్కసారి ఆమె ఆ అద్దాన్ని తన చేతుల్లోకి తీసుకుంది.

చేతులు వణికాయి. వేళ్లు పట్టుతప్పాయి. అద్దం నేలమీద పడి ముక్కముక్కలయి పోయింది. ముక్కలన్నీ పోగుచేసి మటుమాయమయిన తన ముఖాన్నొక్కసారి అందులో చూసుకుంది.

"ఎందుకలా బాధపడిపోతున్నావు" అని ప్రతిబింబం అడిగినట్లయింది. ఆమె త్రుళ్ళిపడింది.

నావల్ల పొరపాటు ఏమైనా జరిగిందనా? - లేదే - మరి? - వారివలన తప్పందనా? - ఊహూ! - ఆయనకంటె అందంగా ఉన్నాననికదూ? నా సౌందర్యాన్ని ఆయన సరిగ్గా పోషించలేదనికదూ? - అంతా అన్నారు అందంగా ఉన్నానని. అందుకే కదా ఇంత గర్వం? - నాకంటె ఎంతమంది అందంగా లేరు ఈ లోకంలో? - ఇంతకీ, ఆయన ఎంత చక్కగా ఉన్నారో చూశానా - లేదు! కాదు చూశాను. కాని నా బాహ్యసౌందర్యం అహంకారంలో మునిగి తేలిపోయాను. ఆయనకు వీటియందు పట్టింపులేదని తెలుసుకుని బాధపడ్డాను. ఆయన నా అందాన్ని మెచ్చుకోలేదు. నిజమే. కాని ఆయనకు కావలసింది అది కాదేమో - అందరి భార్యాభర్తల నిత్యజీవితాల్లో దీనికి అంతగా స్థానంలేదు కాబోలు. శాశ్వతమైన ఆనందాన్ని చేకూర్చే ఆత్మసౌందర్యాన్ని కాపాడుకోవాలి. అదే చిరస్థాయిగా ఉండేది. అదే అతను పూజించగలడేమో! మనోవికాసం పొందాలి. ఇప్పటికైనా తెలుసుకోవడం మంచిది.

అద్దం పెంకులన్నీ చెదరిపోయాయి. ఆమె ప్రతిబింబం మాయమయింది.

"అరె అద్దం బద్దలయిపోయిందే! ఎలా పోయింది" - అంటూ అతను గదిలో అడుగు పెట్టాడు. ఆమెకి మాటలేవీ వినిపించలేదు.

"ఏమండి ఒక్క మాట అడుగుతా; చెప్తారా."

"ఓ! దానికేం పదిమాటలడుగు."

"అదికాదండీ... నే నడుగుతున్నానండీ మీకంటికి...... నేను అందంగా ఉన్నాననేనా, మీ వుద్దేశం?"

"ఊ!... లేకేం! పిచ్చిదానిలాగున్నావే. ఇన్నాళ్ళు నీ అందమే కొరుక్కుతింటున్నా ననుకున్నావా?" అన్నాడతను.

ఆమె ఒక్క గంతులో వెళ్ళి నిలువుటద్దంమీద గుడ్డ తొలగించి చూసింది. ఆమె కళ్లు జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి. అతను ఆమె వెనకాలే నిలుచుని చిరునవ్వు నవ్వుతున్నాడు. ★

మతిమరుపు ప్రొఫెసరుగారు ఒకరోజున భార్యాబిడ్డలతో కలిసి ఆవూళ్లోనే మరొక పేటలో వున్న బంధువులయింట్లో బస చేశారు. ఆ రాత్రి వున్నట్లుండి జడివాన కురవటం ఆరంభించింది.

ఒక రాత్రివేళ ఎవరో లేచి చూస్తే ఆరుబయట పడుకొన్న ప్రొఫెసరుగారు మంచంమీద కనిపించలేదు. ఆయన ఏమైపోయాడోనని యింటిల్లపాదీ నాలుగుమూలలా వెతికారు. ఆయన ఎక్కడా కనుపించలేదు. అందరూ కంగారు పడిపోయారు.

తన యింటికివెళ్ళి గంట గంటన్నరసేపు గడచాక బాగా తడిసిన ప్రొఫెసరుగారు గొడుగు వేసుకువచ్చి గేటుతీసి, తన మంచం తలాపి కట్టకి గొడుగు కట్టేసి కళ్లుమూసుకు పడుకున్నాడు.